సాక్షి
తిరుపతి
శనివారం । 7 । అక్టోబర్ । 2023



బస్సులు కండీషన్‌లో ఉంచాలి

ఆర్టీసీ బస్సులను కండీషన్‌లో ఉంచాలని తిరుపతి డీపీటీఓ చెంగల్‌రెడ్డి సూచించారు.

- 8లో



వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి): వరసిద్ధి వినాయక స్వామికి హుండీ ద్వారా రూ.1.71 కోట్ల ఆదా యం వచ్చినట్లు ఈఓ వెంకటేశు తెలిపారు.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	24
చిత్తూరు	34	24
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	25

న్యూస్‌రీల్

నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

తిరుపతి సిటీ: ఏపీ పీజీసెట్–2023లో ర్యాంకు సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శనివారం నుంచి జరుగుతుందని ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ మురళి తెలిపారు. ఎస్వీయూలో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందనున్న విద్యార్థులకు శనివారం నుంచి ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలనతో పాటు ఫీజు చెల్లింపు ప్రక్రియ జరుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టేట్ బ్యాంకు భవనం మొదటి అంతస్తులో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: గుర్తింపు కార్డుల కోసం రంగస్థల కళాకారులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఏ.బాలకొండయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ నెల 7వ తేదీ వరకు మాత్రమే గడువు ఇచ్చారని చెప్పారు. తాజాగా 8వ తేదీ వరకు పొడిగించారని స్పష్టం చేశారు. అర్హులైన కళాకారులు కళాకారుని పేరు, జెండర్, బ్లడ్ గ్రూపు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, జిల్లా, కళారూపం, అనుభవం, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్ తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. సంబంధిత జెరాక్స్‌లతోపాటు తహసీల్దార్ ఇచ్చిన ధ్రువీకరణపత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయంలోని ఏ బ్లాక్‌లోని 4వ అంతస్తులో ఉన్న పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 8897604650 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

తిరుపతి డివిజనల్ పౌరసంబంధాల అధికారిగా ఈశ్వరమ్మ



తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖలో సహాయ పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న కే.ఈశ్వరమ్మకు డివిజనల్ పౌరసంబంధాల అధికారిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె డివిజనల్ పీఆర్వోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ విభాగానికి చెందిన పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

అవినీతి అనకొండ ఆనం



వెంకటగిరిరూరల్: ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలో పాల్పడిన అవినీతిని త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతానని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్‌జేఆర్ భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆల్తూరుపాడు రిజర్వాయర్, వెంకటగిరిలోని జగనన్న లేఅవుట్‌లో ఆనం రామనారాయణరెడ్డి భారీస్థాయిలో అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన కుటుంబంలో జన్మించి, ప్రజలు మోసగించి దిగజారుడు రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారలతో వారం రోజుల్లో వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ పీ ప్రసాద్‌రెడ్డి వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై ఎన్నికల కమిషన్ నిషేధం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియలో పాల్గొంటున్న అధికారుల బదిలీలపై నిషేధం విధించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీలో ఆర్‌ఓ (కలెక్టర్), ఈఆర్‌ఓ (జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఆర్‌డీఓ, డిప్యూటీ కలెక్టర్, నగరపాలక కమిషనర్), ఏఈఆర్‌ఓ లుగా వ్యవహరించే (తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్), వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర స్థాయి అధికారులను 2024 జనవరి 5 వ తేదీ వరకు బదిలీ చేసేందుకు వీల్లేదని పేర్కొన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 10వ తేదీలోపు వివరాలు పంపించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మద్యం దుకాణాల్లో మాయలోళ్లు

తప్పుడు లెక్కలు.. మద్యం బాటిళ్ల మాయం.. దుకాణదారుల నుంచీ వసూళ్లు.. ఇవన్నీ కప్పిపుచ్చడానికి దుకాణానికి నిప్పు.. ఆపై సినీ పక్కీలో బీమా సొమ్ము స్వాహాకు యత్నం.. ఇదీ మద్యం దుకాణల్లో మాఫియా. దీనిపై అందిన ఫిర్యాదులతో ఉన్నతాధికారుల రహస్య విచారణలో దుకాణాల్లో మాయలోళ్ల అవినీతి వెలుగులోకి వచ్చింది.



- తప్పుడు లెక్కలు చూపి, మద్యం బాటిళ్లు మాయం
- చెంచులక్ష్మికాలనీ దుకాణంలో రూ.55 లక్షల స్వాహా
- స్వాహా సొమ్ముని దాచేందుకు మద్యం దుకాణానికి నిప్పు
- మరోవైపు మద్యం దుకాణదారుల నుంచి నగదు వసూలు
- ప్రాథమిక విచారణలో ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి..
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

సాక్షి టాస్క్‌ఫోర్స్:

మద్యం దుకాణాల్లో మాయదారోళ్లు పెట్రేగిపోతున్నారు. మద్యం విక్రయించగా వచ్చిన అసలు, ఆదాయాన్ని తిరిగి చెల్లించకుండా మొత్తాన్ని కాజేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ జేబులు నింపుకుంటున్నారు. మరోవైపు కొన్ని మద్యం బ్రాండ్లను బార్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ బ్రాండ్లు మద్యం ప్రియులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. శ్రీకాళహస్తి పరిధిలో చోటు చేసుకున్న మద్యం మాఫియా భాగోతం వెలుగు చూడడంతో.. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో మాయదారోళ్లపై నిఘా పెట్టింది. ఇటీవల శ్రీకాళహస్తి పరిధిలోని రెండు మద్యం దుకాణాలను కేంద్రంగా చేసుకుని కొందరు అధికారులు, సిబ్బంది భారీ అవినీతికి పాల్పడిన విషయం వెలుగులోకి వచ్చింది.

రికవరీ చేశాం.. సస్పెండ్ చేశాం

తిరుపతి జిల్లా పరిధిలోని మద్యం దుకాణాల్లో రూ.6.30 లక్షలకు పైగా మిస్ అయినట్లు తేలింది. ఈ మొత్తాన్ని ఆ వ్యక్తి నుంచి రికవరీ చేశాం. అవినీతికి పాల్పడిన వ్యక్తిని తొలగించాం.

–జానకిరాం, ఎక్సైజ్ సూపరింటెండెంట్, గోడౌన్ మేనేజర్

అదెలా అంటారా..

శ్రీకాళహస్తి పరిధిలోని చెంచులక్ష్మి కాలనీలోని షాప్ నంబర్ 10997లో ప్రస్తుత ఏడాది ప్రారంభంలో మద్యాన్ని విక్రయించి రూ.55 లక్షలు స్వాహా చేశారు. ఈ మొత్తాన్ని సంబంధిత అధికారులు కొందరు, సిబ్బంది పంచుకున్నారు. అక్రమాల విషయం మార్చి నెలలో వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వెంటనే నగదును రికవరీ చేసి, సంబంధిత సిబ్బందిని తొలగించమని ఆదేశించారు. చేసేది లేక అధికారి ఒకరు దుకాణం బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి నుంచి ఆస్తిని విక్రయించి రూ.55 లక్షల నగదు రికవరీ చేసినట్లు చూపించారు. అయితే ఈ విషయాన్ని, ఆ వ్యక్తిని ఎక్కడా బయటపెట్టకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని ఆ వ్యక్తి ఒక్కడే నష్టపోకుండా ఉండేందుకు అధికారి ఒకరు స్కెచ్ వేశారు. అందుకోసం మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బందిని ఓ చోటుకు పిలిపించి, సమావేశం నిర్వహించారు. ప్రతి మద్యం దుకాణం నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన మొత్తాన్ని ఇస్తే.. మద్యం దుకాణంలోని సిబ్బందికి పూర్తి స్వేచ్ఛనిస్తామని హామీ ఇచ్చారు. ఎలా విక్రయించి సొమ్ము చేసుకున్నా ఎవరూ తనిఖీలకు రాకుండా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. అడిగినట్లే సిబ్బంది అందరూ కలిసి రూ.55 లక్షలు ఇచ్చారు. అయితే ఆలా వసూలు చేసిన నగదును ఆస్తి అమ్మి కట్టిన వ్యక్తికి ఇవ్వలేదు.

దుకాణంలోని మద్యాన్ని తరలించి.. ఆపై తగులబెట్టి..

మార్చి నెలలో ఐదు రోజుల పాటు వరుసగా దుకాణంలో నిల్వ చేసిన 36,981 మద్యం బాటిళ్లను గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతానికి తరలించారు. ఆ తరువాత ఏప్రిల్ 3న పెద్దకన్నలి (సింగమాల) మద్యం దుకాణానికి నిప్పుపెట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణం తగలబడిందని, అందులో రూ.55 లక్షలు విలువ చేసే మద్యం బాటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయని రిపోర్ట్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎటువంటి పంచనామా చేయకుండా.. గొయ్యి తవ్వి అందులో పూడ్చిపెట్టారు. అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం ఎంత మద్యం అగ్నికి ఆహుతైందని రిపోర్ట్ ఇవ్వలేదు. ఎందుకంటే ఆ మంటల్లో తగలబడింది అతి తక్కువ బాటిళ్లు మాత్రమే. అవి కూడా చీప్ మద్యం బాటిళ్లేనని సమాచారం. కొందరు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అవినీతి భాగోతంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో రహస్య విచారణ జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. మద్యం షాపులపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ శాఖ పోలీసు అధికారులు విస్తుపోయే నిజాలు వెలుగు చూడడంతో షాక్ గురైనట్లు తెలిసింది. మద్యం దుకాణాల్లో జరిగిన అవకతవకలపై విచారణ కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.



ఏప్రిల్ 3న అగ్నికి ఆహుతవుతున్న మద్యం దుకాణం (ఫైల్)

సినిమా స్క్రిప్ట్‌ని తలిపించేలా స్కెచ్

రెండు వైపులా స్వాహా చేసిన అధికారి ఈ మొత్తం వ్యవహారం సమసిపోయేలా భారీ స్కెచ్ వేశారు. పక్కా యాక్షన్ ప్లాన్ ప్రకారం ఓ వైన్ షాపునకు నిప్పు పెట్టి ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయటం ద్వారా వచ్చిన నగదును రికవరీ చేసేలా పథకం రచించారు. అనుకున్న ప్లాన్ ప్రకారం తొట్టంబేడు మండలం పెద్దకన్నలి ప్రభుత్వ దుకాణం (సింగమాల) ఎంచుకున్నారు. మద్యం అవసరం లేకపోయినా.. మార్చి 23, 24, 27, 29, 31న వరుసగా రూ.లక్షల విలువ చేసే మద్యాన్ని పెద్దకన్నలి దుకాణంలో నిల్వచేశారు. దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి మద్యం అవసరం లేదని చెబుతున్నా వినిపించుకోలేదు. ఏప్రిల్ 2వ తేదీన సూపర్ వైజర్‌ని పిలిపించుకున్నారు. స్వాహా అయిన డబ్బులు రికవరీ చేయాలి, అందుకు సహకరించాలని ఒత్తిడి చేశారు. తాను కూడా బంగారాన్ని కుదువపెట్టి రూ.2.50 లక్షలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు తానేం చేయాలో చెప్పమని అడిగారు. దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కావడానికి అవకాశం ఉన్న పరికరాలు ఏవైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. దుకాణంలో విద్యుత్ పరికరాల గురించి వివరించారు. ఏప్రిల్ 3న సెలవు పెట్టి ఎక్కడికైనా వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. ఎందుకు? ఏమిటి? అని అడిగారు. విషయం ఏమీ చెప్పకుండా అతని వద్ద నుంచి సెలవు లెటర్ రాయించుకుని పంపించేశారు.

ఆర్టీసీ కార్గో.. ఇక వినూత్నం



- నేటి నుంచి డిజిటల్ పేమెంట్లు
- బుకింగ్ టైమ్‌లోనే పార్శిళ్లకు పేమెంట్
- ఏజెంట్ల కమీషన్ పెంపు

పారదర్శక సేవలు.. ఏజెంట్ల కమీషన్ పెంపు.. చిల్లర సమస్యకు చెక్ పెడుతూ డిజిటల్ పేమెంట్లు.. బుకింగ్ సమయంలోనే చార్జీల చెల్లింపు..వందశాతం డోర్‌డెలివరీ.. వెరసి ఇక ఆర్టీసీ కార్గో వినూత్నంగా మారనుంది.

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను పెంచడమే కాకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు. ఏజెంట్లకు కమీషన్ రూ.10 శాతం నుంచి రూ.15 శాతానికి పెంచారు. మరోవైపు బల్క్ బుకింగ్‌లు చేస్తున్న వారికి 5 శాతం నుంచి 10 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నారు. 20 పార్శిళ్లు, ఆ పైన చేస్తే 5 శాతం డిస్కౌంట్ చెల్లించనున్నారు. రోజు వారి ఆదాయం రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నారు.

నేటి నుంచి కార్గోలో డిజిటల్ పేమెంట్లు

ఆర్టీసీలో కార్గో సేవలు పారదర్శకంగా అందించడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. శనివారం నుంచి ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని కార్గో సెంటర్లలో డిజిటల్ పేమెంట్‌లు అమలు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు యూపీఐ పేమెంట్ చేయడానికి స్కానర్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఫోన్‌పే, గూగుల్ పే తదితర సౌకర్యాలను కల్పించనున్నారు. చేతికి డబ్బులు ఇవ్వడం ద్వారా కార్గో నిర్వాహకులు సక్రమంగా చిల్లర్లు ఇవ్వడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికితోడు అదనపు రుసుం వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం అన్ని కార్గో సెంటర్లలో కేవలం డిజిటల్ పేమెంట్ సౌకర్యాలను ప్రారంభిస్తున్నారు.

నేటి నుంచి పార్శిల్ బుకింగ్ సమయంలోనే చార్జీలు చెల్లింపు

పారదర్శకమైన సేవలను అందించడానికి ఆర్టీసీ పలు మార్పులు చేపడుతోంది. ప్రధానంగా కార్గోలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు పార్శిళ్ల చేస్తున్న సమయంలో బుకింగ్ చేసిన వ్యక్తి కాకుండా పార్శిల్‌ను తీసుకునే వ్యక్తి కార్గో చార్జీలను చెల్లించేవారు. దీంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్శిల్ తీసుకునే వారు సక్రమంగా తీసుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో బుకింగ్ చేస్తున్న వ్యక్తే కార్గో చార్జీలను చెల్లించేలా చర్యలు చేపట్టనున్నారు.



తిరుపతి బస్టాండ్‌లోని కార్గో సెంటర్

వంద శాతం డోర్ డెలివరీకి ఏర్పాట్లు

కార్గో సెంటర్ నుంచి 10 కిలోమీటర్ల వరకు డోర్ డెలివరీ సిస్టమ్ ఉండేది. కాంట్రాక్టర్లు సక్రమంగా చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల కాంట్రాక్టర్లను మార్పు చేశారు. తిరుపతిలోనూ అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త కాంట్రాక్టర్‌ను నియమించారు. 10 కిలోమీటర్ల దూరం వరకు డోర్ డెలివరీ చేయాలనే నిబంధనను అమలు చేశారు. ఆ మేరకు శనివారం నుంచి 100 శాతం పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

సమర్థవంతంగా కార్గో సేవలు



జిల్లా ఆర్టీసీ కార్గో సేవలను సమర్థవంతంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ప్రధానంగా శనివారం నుంచి డిజిటల్ పేమెంట్లు వంద శాతం అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అంతేకాకుండా పార్శిల్ బుకింగ్‌కు సంబంధించి వందశాతం బుకింగ్ సమయంలోనే పేమెంట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు డోర్ డెలివరీని కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించాం. ప్రస్తుతం రోజు వారీ ఆదాయం రూ.4 లక్షలు ఉందని, ఇకపై రోజువారీ ఆదాయాన్ని రూ.6 లక్షలకు పెంచడానికి ప్రయత్నం చేస్తున్నాం.

–సురేంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జి, ఆర్టీసీ కార్గో

పార్వతీ తనయుడికి పూలంగి సేవ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి శుక్రవారం రాత్రి పూలంగి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే గణనాథునికి విశేష అభిషేకం జరిపారు. సుగంధ పుష్పాలు గరిక మాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అలంకారం మండపంలో సిద్ధి, బుద్ధి సమేతంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం కనులపండువగా పూలంగి సేవ నిర్వహించారు. పంచ హారతులు సమర్పించారు. శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం ప్రాకారోత్సవం చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు. ఉత్సవాలకు వేలూరుకు చెందిన రాజమాణిక్యం నాయుడు కుమారులు, కాణిపాకానికి చెందిన రాధాకృష్ణన్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు పుష్పపల్లకి సేవ

వినాయక స్వామివారికి శనివారం రాత్రి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఉభయకర్తలు, అధికారుల పర్యవేక్షణలో సర్వం సిద్ధం చేస్తున్నారు.

'సుమ'నోహరంగా బోయకొండ



చౌడేపల్లె : విశేష పుష్పాలంకరణలో బోయకొండ గంగమ్మ ఆలయం నూతన శోభ సంతరించుకుంది. శుక్రవారం బెంగళూరు దేవనహళ్లి లక్ష్మీఫ్లవర్ డెకరేషన్స్ నిర్వాహకులు చంద్రశేఖర్, సతీష్, గోపాలప్ప ఆధ్వర్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. సుమారు రూ:4 లక్షల విలువపై సుగంధ సుమాలతో అలంకరించారు. దాదాపు 15 ఏళ్లుగా దసరా ఉత్సవాలకు వారం ముందుగా ఆలయాన్ని ముస్తాబు చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. డెకరేటర్స్‌ను ఈఓ చంద్రమౌళి ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. గురువారం అర్ధరాత్రి వరకు 68,558 మంది స్వామివారిని దర్శించుకోగా 29,508 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముందస్తు చర్యలతో విపత్తులకు అడ్డుకట్ట

- ఒక్కో విభాగానికి ఒక్కో అధికారితో నివారణ చర్యలు
- టీటీటీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: టీటీడీలో విపత్తుల నివారణకు ముందస్తు చర్యలతో అడ్డుకట్ట వేయాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో విపత్తుల నివారణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ విపత్తుల నివారణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, యూనిసెఫ్ కన్సల్టెంట్ అమల్ కృష్ణ రూపొందించిన డాక్యుమెంట్‌ను పరిశీలించారు. అనంతరం వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాక్యుమెంట్‌లోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏటా బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భారీగా వచ్చే యాత్రికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధీకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, అగ్ని ప్రమాదాలు, వరదలు, ఇతర విపత్తులను ఎదుర్కొనేందుకు ఎప్పటికప్పుడు సంబంధిత నిపుణుల సహకారం తీసుకోవాలన్నారు. విపత్తుకు ముందు, విపత్తు జరిగిన సమయంలో, ఆ తర్వాత టీటీడీలోని ప్రతి విభాగం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు. ఒక్కో రకం విపత్తు నివారణకు ఒక్కో అధికారిని నియమించి తరచూ సమావేశాలు నిర్వహించి నివారణ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నాగరాజు, అమల్ కృష్ణ మాట్లాడుతూ టీటీడీలోని పలు విభాగాల్లో విపత్తుల నివారణ ఎలాంటి చర్యలు తీసుకోవాలో డాక్యుమెంట్‌లో వివరించినట్లు తెలిపారు. ఈఓ వారిని అభినందించి శ్రీవారి ప్రసాదంతో సన్మానించారు. జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ ధర్మారెడ్డి

డాక్యుమెంట్‌లోని అంశాలివీ..

క్యూల క్రమబద్ధీకరణ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వ్యూహాలు, ఉత్సవాల నిర్వహణ, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా వివరించారు. ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల జరిగే విపత్తులు, అగ్నిప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు, తాగునీరు, కల్తీ ఆహారం, అపరిశుభ్రత వల్ల కలిగే విపత్తులు, ఘాట్ రోడ్లు, నడకదారుల్లో సంభవించే విపత్తుల నివారణ చర్యలను పొందుపరిచారు.

నేటి వరకు సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు

చిత్తూరు కలెక్టరేట్ : సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే శనివారంలోపు తెలియజేయాలని ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. జోన్–4 పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీజీటీలకు పీజీటీలుగా ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక సీనియారిటీ జాబితాను డీఈఓ కార్యాలయానికి పంపించామన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మోడల్ స్కూళ్ల టీజీటీలు జాబితాలను పరిశీలించుకుని, అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా డీఈఓ మెయిల్ ద్వారా ఆర్జేడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి 11వ తేదీన తుది సీనియారిటీ జాబితాను రూపొందిస్తామని వివరించారు. 12న సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్ల పరిశీలన, 13 పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు డీఈఓ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

బస్సులు కండీషన్‌లో ఉంచాలి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ బస్సులను కండీషన్‌లో ఉంచాలని, ఇందుకు మెకానిక్‌లు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని తిరుపతి డీపీటీఓ చెంగల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆర్టీసీ మెకానిక్‌లు, సూపర్‌వైజర్లకు సర్వీసుల వాడకంపై అశోక్ లైలాండ్ కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా బీఎస్–4 సర్వీసుల నిర్వాహణతోపాటు ఈడీసీ, డీజీఆర్, సిస్టమ్స్, సెన్సార్లు, వైరింగ్, బ్యాటరీలు, సెల్ఫ్ స్టార్టల నిర్వహణ, ఇంధనం పొదుపు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లా డీపీటీఓలతోపాటు 18 డిపోల మెకానిక్‌లు పాల్గొన్నారు.

మామండూరులో ఎంఐజీ లేఅవుట్

- మధ్యతరగతి కోసం జగనన్న స్మార్ట్ టౌన్ షిప్
- 11.95 ఎకరాల్లో వెంచర్
- బ్రోచర్ ఆవిష్కరణ
- ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీ
- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడి


అధికారులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి తుడా: చంద్రగిరి – బెంగళూరు ఆరు లేన్ల జాతీయ రహదారికి సమీపంలో రూపుదిద్దుకోనున్న జగనన్న టౌన్ షిప్ ద్వారా మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం కానుందని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ ఆమోదంతో తుడా ఆధ్వర్యంలో చంద్రగిరి మండలం మామండూరులో 11.92 ఎకరాల్లో జగనన్న టౌన్ షిప్ (ఎంఐజీ లేఅవుట్) అందుబాటులో ఉందన్నారు. శుక్రవారం తుడా కార్యాలయంలో జగనన్న టౌన్ షిప్ బ్రోచర్‌ను తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డితో పాటు వీసీ హరికృష్ణ, కార్యదర్శి లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న సీఎం జగనన్న సంకల్పంతో ఊర్లకు ఊర్లు ఏర్పడ్డాయన్నారు. చంద్రగిరిలో దాదాపు 25 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో జగనన్న టౌన్ షిప్ ఏర్పాటుకు చొరవ తీసుకోవడం శుభపరిణామం అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విశాలమైన రోడ్లు, ఆహ్లాదకర వాతావరణం, ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలతో మొత్తం 135 ప్లాట్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీతో ప్లాటు కేటాయించనున్నట్లు తెలిపారు. మొత్తం ప్లాట్లలో 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా 5 శాతం ప్లాట్లు పెన్షనర్లకు కేటాయించనున్నారు. ఆసక్తి కలిగిన వారు http:// migapdtcp.ap.gov.inలో సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేసుకుని ప్లాటు మొత్తం విలువలో 10 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు తుడా కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చని తుడా వీసీ హరికృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడా ప్రణాళిక విభాగం అధికారి శ్రీనివాసులురెడ్డి, ఇతర విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర విజయవంతం


సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ జాతర గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవంతమైందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో శుక్రవారం పోలేరమ్మ జాతర కమిటీ సభ్యులను సన్మానించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలు, కులమతాలకతీతంగా రాష్ట్రస్థాయి పండుగగా పోలేరమ్మ జాతర నిర్వహించామన్నారు. 18 ఏళ్ల కిందట అమ్మవారిని గుడి దగ్గర దర్శనం చేసుకున్నానని, మళ్లీ ఈ ఏడాది సాధారణ భక్తునిలా క్యూలో వెళ్లి సాయికృష్ణ యాచేంద్ర, రాజా కుటుంబీకులతో కలసి అమ్మవారిని దర్శించుకున్నానని చెప్పారు. దర్శన టికెట్ల విక్రయం ద్వారా గత ఏడాది రూ.16 లక్షలు రాబడి వస్తే ఈ ఏడాది రూ. 33 లక్షలు రాబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి ఢిల్లీ బాబు, పీ ప్రసాద్‌రెడ్డి, ఎస్ బాలయ్య, ఎల్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఏ మురళి, జయప్రకాష్‌జెట్టి, సీ మురళి, వీవీ రమణయ్య, వీ చెంగయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరలో రూ.55,29,932 రాబడి

పోలేరమ్మ జాతరలో రూ.55,29,932 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది అమ్మవారి సేవా టికెట్ల ద్వారా రూ.16,36,600 లక్షలు రాగా ఈ ఏడాది రూ.33.38 లక్షలు వచ్చిందన్నారు. హుండీ ద్వారా గత ఏడాది రూ.17,56,665 లక్షలు రాగా ఈ ఏడాది రూ. 21.91,932 ఆదాయం వచ్చిందని చెప్పారు. మొత్తం రూ.55,29,932 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

అన్నా చెల్లెళ్ల దారుణ హత్య


కుమారుడు, భర్తతో మనీషా (ఫైల్)

తిరుపతి క్రైమ్: నగరంలోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో అన్నా చెల్లెళ్లు దారుణంగా హత్యకు గురైన ఘటన శుక్రవా రం చోటు చేసుకుంది. అలిపిరి సీఐ అబ్బన్న కథనం మేరకు.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన యువరా జ్, మనీషా దంపతులకు షక్షీమ్(6), ప్రజ్ఞాన్(4) ఇ ద్దరు పిల్లలు ఉన్నారు. ఇతను మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఏడాది నుంచి భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో దూరంగా ఉండేవారు. అయితే యువరాజ్ 4 రోజుల కిందట తిరుపతి కి చేరుకుని నగరంలోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో బస చేశాడు. ఇదే క్రమంలో భార్యకు ఫోన్ చేసి, తిరుపతి కొస్తే మాట్లాడుకుందామని చెప్పా డు. దీంతో మనీషా పిల్లలను తీసుకుని హైదరాబాద్ వరకు రైలులో వచ్చి, అక్కడి నుంచి తన అన్న హర్షవర్ధన్‌తోపాటు విమానంలో తిరుపతికి చేరుకుంది. ఆ రాత్రి ఏం జరిగిందో ఏమో కానీ వీరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో యువరాజ్ తన భార్య మనీషాతోపాటు ఆమె అన్న హర్షవర్ధన్(25) కూడా దారుణంగా కత్తితో పొడిచి, హత్య చేశాడు. అయితే హత్యకు కారణాలు పలు కోణాల్లో వినిపిస్తున్నాయి. వీరి మధ్య ఆస్తి తగాదాలున్నాయని, యువరాజును హత్య చేస్తే పెద్ద మొత్తంలో ఆస్తి వస్తుందని, అతడిని చంపడానికి వారు తిరుగు తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఈ క్ర మంలోనే యువరాజ్ చంపి ఉండొచ్చని భావిస్తున్నా మన్నారు. యువరాజ్ అన్నతో మనీషాకు వివాహేతర సంబంధం ఉండడంతో వారి మధ్య గొడవ జరిగినట్లు కూడా తెలిసిందని సీఐ చెప్పారు. అయితే నిజాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉందన్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చామని, వారు వస్తే నిజాలు బయటపడతాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించామన్నారు.

అల్పాహారం, పండ్లు పంపిణీ


పిల్లలకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన పండ్లు, స్వీట్లు, అల్పాహారం

తిరుపతి కల్చరల్: టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అనిల్ రాయల్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అభయక్షేత్రంలోని పిల్లలకు అల్పాహారం, స్వీట్లు, బిస్కెట్లు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభయక్షేత్రం పిల్లల మధ్య అనిల్ రాయల్ కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హరి, సాయి, సూరి, చైతు,స్నేహితులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి


మృతి చెందిన వినోద్‌కుమార్(ఫైల్)

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నం పోర్టు రోడ్డులో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన మల్లాపు వినోద్‌కుమార్ (38) కృష్ణపట్నం పోర్టులో కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పని ముగించుకుని వేకువజామున ఇంటికి వస్తున్న సమయంలో పోర్టు నుంచి తమ్మినపట్నంలోని విద్యుత్ పరిశ్రమలో బొగ్గు లోడ్ దించి, తిరిగి వెళుతున్న టిప్పర్ వినోద్‌కుమార్‌ను ఢీ కొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు.